క్లుప్తంగా

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న దృశ్యం

వెలుగోడు: స్థానిక బస్టాండ్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులతో నంద్యాల ప్రధాన రహదారి నుంచి వేల్పనూరు రోడ్డు వరకు నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ వేల్పుల జయపాల్, పీఆర్ ఏఈ శ్రీనివాసులు సోమవారం పరిశీలించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. మేజర్ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజల ఇబ్బందులను గమనించి అవసరమైన చోట రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. బస్టాండ్ ప్రాంతం అధ్వానంగా మారడంతో ముందుగా గ్రావెల్ తోలి,ఆ తరువాత సిసి రోడ్డు వేస్తున్నట్లు వివరించారు. అలాగే పాత బస్టాండ్ లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నాలుగు రూములు నిర్మిస్తున్నామన్నారు.

సారా విక్రయిస్తే కేసులు



పట్టుబడిన నాటుసారా చూపుతున్న ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ జఫ్రుల్లా, పోలీసులు

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేయడం ఖాయమని ఎక్సైజ్ శాఖ ఎస్ఐ జఫ్రుల్లా హెచ్చరించారు. సోమవారం పట్టణంలో ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో స్వాధీనం చేసుకున్న సారా, మద్యం బాటిళ్లను చూపించారు. పట్టణంలోని నీలిషికారి పేటలోదాడుల జరిపి నాటుసారా అమ్ముతున్న షికారి శాంతిని అరెస్టు చేసి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. హెడ్ కానిస్టేబుళ్ల శంకర్ నాయక్, పద్మనాభం, పోలీసులు శివన్న, సుధీర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నాటుసారా స్వాధీనం

బండిఆత్మకూరు: మండలంలోని పరమటూరు గ్రామానికి చెందిన బోయ కృష్ణుడు అనే వ్యక్తి నుంచి సోమవారం 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. కృష్ణుడు..సంతజూటూరు పికప్ ఆనకట్ట వద్ద నాటుసారా అమ్ముతున్నాడనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేయగా, అతని వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని వివరించారు.

స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

మహానంది: మండలంలోని మసీదుపురం గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో ఉన్న చేతి బోరును కూటమి నేతలు పూడ్చేసి స్థలాన్ని ఆక్రమిస్తున్నారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామ ఎంపీటీసీ మునగాల మల్లికార్జునరెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు ఎన్నో ఏళ్ల నుంచి మంచి నీటిని అందిస్తున్న మినరల్ ప్లాంట్ సమీపంలో చేతిపంపును పూడ్చేసి స్థలాన్ని ఆక్రమిస్తున్నారని ఎంపీడీఓ దౌలా దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

చిరుత దాడిలో ఆవుదూడ మృతి



మృతి చెందిన ఆవుదూడ

వెలుగోడు: పట్టణ సమీపంలో ఉన్న గట్టుతండాకు చెందిన లక్ష్మానాయక్ ఆవుల మందలో చిరుత దాడికి ఆవు దూడ మృతి చెందింది. ఫారెస్ట్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం తెల్లవారుజామున రిజర్వాయర్ సమీపంలో ఉన్న లక్ష్మానాయక్ ఆవుల మందను నిలుపుకున్నాడు. ఈ సమయంలో చిరుత ఆవుదూడపై దాడి చేసింది. దీంతో లక్ష్మానాయక్.. దాడి సమాచారాన్ని ఫారెస్ట్ అధికారి గోపి, పశువైద్యాధికారి జుబేర్‌కు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకొని దాడి జరిగిన విషయం వాస్తవమేనని చెప్పారు.

నల్లమల ఘాట్‌లో ట్రాఫిక్ జాం

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డులో సోమవారం రాత్రి 11 గంటల సమయంలో మినీలారీ బోల్తా పడటంతో ట్రాఫిక్‌జాం అయింది. నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న ఈ లారీ ఘాట్‌రోడ్డులోని మోదుగమాను వంతెన సమీపంలో రైల్వే వంతెన దిమ్మెను ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలైనట్లు సమాచారం. లారీ బోల్తాతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో గాజులపల్లె మెట్ట సమీపంలో లారీలు, బస్సులు నిలిచిపోయాయి.

వెన్నుపోటు సీఎం చంద్రబాబుకు
వెన్నతో పెట్టిన విద్య

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దారాసుధీర్
- అమలుకు సాధ్యంకాని హామీలిచ్చి సీఎం సీట్లో కూర్చున్నారని విమర్శ
- హామీలు నెరవేర్చాలని అడిగితే కేసులు బనాయింపు
- రేపు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం'
- విజయవంతం చేయాలని పిలుపు



80 బన్నూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద పోస్టర్లను విడుదల చేస్తున్న డాక్టర్ దారాసుధీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా/పాములపాడు/కొత్తపల్లి: సీఎం చంద్రబాబునాయుడుకు వెన్నుపోటు రాజకీయాలు వెన్నతోపెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారాసుధీర్ అన్నారు. సోమవారం జూపాడుబంగ్లా మండలంలోని 80బన్నూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దిలేటినాయుడు ఇంట్లో, పాములపాడు మండల కేంద్రంలో, కొత్తపల్లిలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి ఇంటి వద్ద వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో, ఈనెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినంపై కార్యకర్తల సమావేశం నిర్వహించారు. డాక్టర్ దారా సుధీర్ మాట్లాడుతూ వైస్‌రాయ్ హోటల్లో మామ నందమూరి తారకరామరావుకు వెన్నుపోటు పొడిచి టీడీపీ పగ్గాలు దక్కించుకున్న చంద్రబాబునాయుడుకు వెన్నుపోటు రాజకీయాలు ఆదినుంచి అలవాటేనని విమర్శించారు. పదవీ వ్యామోహంతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని సూపర్‌సిక్స్ హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాకా వాటిని అమలు చేయాలంటే భయమేస్తుందనడం ప్రజలకు వెన్నుపోటు పొడవటమేనన్నారు.

ఏడాదిలోపే నవరత్నాలు అమలుచేసిన జగన్

2019ఎన్నికల్లో నవరత్నాలను హామీగా ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన ఏడాదిలోపే అమలుచేసి రికార్డుసృష్టించారని దారా సుధీర్ తెలిపారు. 2024లో చంద్రబాబు ఇచ్చిన హామీలకంటే మెరుగైన హామీలను ఇచ్చి ఉంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయ్యేవాడన్నారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు అమలుకు సాధ్యం కావని ఆనాడే జగన్‌మోహన్‌రెడ్డి తేల్చిచెప్పారన్నారు.

అప్పులు తెచ్చిన డబ్బు ఏం చేశారో?

చంద్రబాబునాయుడు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చాలంటే రూ.1.26లక్షల కోట్లు అవసరం అవుతాయని సుధీర్ అన్నారు. అంత మొత్తాన్ని ఏడాదిలోపే అప్పు చేసిన సీఎం హామీలు అమలు చేయకపోగా చేసిన అప్పుడబ్బులు ఏం చేశారో వెల్లడించాలని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగితే దౌర్జన్యాలు చేస్తూ తప్పుడు కేసులు బనాయిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేయటం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో దౌర్జన్యాలు, అవినీతి, అక్రమాలు, అక్రమవసూళ్లు అధికమయ్యాయన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

కూటమి అన్యాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కూటమిపాలనలో జరుగుతున్న అన్యాయాలను, అమలుకునోచుకోని సూపర్‌సిక్స్ పథకాల వివరాలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని డాక్టర్ దారాసుధీర్ కోరారు. ఈనెల 4న నందికొట్కూరు పట్టణంలో వెన్నుపోటు దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం వెన్నుపోటు దినోత్సవ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జూపాడుబంగ్లా జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కేశవరెడ్డి నాగార్జునరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోసిక తిరుమలేశ్వరరెడ్డి, జూపాడుబంగ్లా మండల అధ్యక్షులు తోకల కృష్ణారెడ్డి, బీసీ సెల్ తాలూకా అధ్యక్షుడు విజయ్‌కుమార్, మండల పార్టీ ఉపాధ్యక్షులు నక్క చిన్నమల్లయ్య, దినేష్, ప్రదానకార్యదర్శి లక్ష్మన్నగౌడు, వైఎస్సార్‌సీపీ పాములపాడు మండల కన్వీనర్ నాగరాజు, సర్పంచు కోట్ల చంద్రారెడ్డి, ఎంపీటీసీలు బషీరాహ్మద్, సురేష్, కో ఆప్టెడ్ సభ్యుడు ముర్తుజావలి, సీనియర్ నాయకులు బాలసుబ్బారెడ్డి, చలమారెడ్డి, కొత్తపల్లి జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సింగారం వెంకట రమణ(రంగా), ఎంపీటీసీలు శివన్న, బాలరాజు, సర్పంచ్ బాల ఎల్లయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్లు గౌరు జనార్దన్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మహబూబాషా, కో–ఆప్టెడ్ మెంబర్ మహమ్మద్ గౌస్, నియోజకవర్గ బూత్ కమిటీ ఇన్‌చార్జ్ నాగలక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేద్దాం

పగిడ్యాల: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అసమర్థ పాలనను నిరసిస్తూ ఈనెల 4న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించే వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయంతం చేద్దామని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాలూరు వెంకటేశ్వర్లు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం నెహ్రూనగర్‌లో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఏడాది కాలం గడుస్తున్నా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడం విచారకరమన్నారు. సంపద సృష్టించడం తెలుసునని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసే ఏ ఒక్క పథకాన్ని తొలగించకుండా ఇంకా మెరుగైన సంక్షేమ పథకాలను ఇస్తామని ఉదరగొట్టి ఇప్పుడు ఒక్క బటన్ కూడా నొక్కలేక తండ్రీకొడుకులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఎద్దేవా చేశారు. నిరసనకు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు మేకల రవికుమార్, దూదేకుల మహ్మద్, తదితరులు ఉన్నారు.

చంద్రబాబు మోసకారి



మాట్లాడుతున్న షంషీర్ అలీ,యేసు రత్నం

వెలుగోడు: సూపర్ సిక్స్ హామీలతో చంద్రబాబు ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు షంషీర్ అలీ,ఎస్సీ సెల్ అధ్యక్షుడు యేసురత్నం విమర్శించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ఏడాదిలో వైఎస్ జగన్ 80 శాతం హామీలను అమలు చేశారని, చంద్రబాబు ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం మోసాలు,అరాచకాలకు నిరసనగా ఈ నెల 4వ తేదీన మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలో 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, నాయకులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

భక్తులతో పోటెత్తిన మహానంది





మహానంది చిన్న కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు,మహానందీశ్వర దర్శనానికి వేచి ఉన్న భక్తులు

మహానంది: వేసవి సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో మహానంది ఆలయం భక్తులతో పోటెత్తుతోంది. సోమవారం వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ముందుగా భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. వేలాది మంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. అలాగే కోదండరామాలయం, వినాయకనంది, గరుడనంది క్షేత్రాలను సందర్శించి రాతినంది సర్కిల్, పెద్దనంది విగ్రహాలను తిలకించారు. శివరాత్రి ఉత్సవాలను తలపించే విధంగా భక్తులు వస్తుండటంతో వసతి గృహాల కొరత వేధిస్తోంది.

మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడ వీధులోని నిత్య కళావేదికపై బాపట్లకు చెందిన వి.లక్ష్మి, బృందం సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమములో మహాగణపతిం , నాగేంద్రహారాయ శివస్తుతి, దేవీస్తుతి, తదితర గీతాలకు మనస్విని, భవిక్షశ్రీ తదితరులు నృత్యం చేశారు.



సంప్రదాయ నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

హైవే కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: నేషనల్ హైవే 340సీ రోడ్డు నిర్మాణ పర్యవేక్షణాధికారుల నిర్లక్ష్యం వల్ల కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేస్తున్న విషయమై లోకాయుక్తలో ఫిర్యాదు చేయనున్నట్లు సీపీఐ జిల్లా నాయకుడు రమేష్‌బాబు తెలిపారు. సోమవారం తర్తూరు అంచెవద్ద హైవే రోడ్డుపై కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదం చోటుచేసుకుందని పేర్కొంటూ సంఘటనా ప్రాంతం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఎన్‌హెచ్ 340సీ రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించి నాసిరకంగా పనులు జరిగాయని పేర్కొంటూ కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం గుర్తు చేశారు. కాంట్రాక్టర్లతో రోడ్డు పర్యవేక్షణాధికారులు కుమ్మక్కై పనుల పర్యవేక్షణను గాలికివదిలేసినట్లు ఆరోపించారు. ఆటో యూనియన్ నాయకులు మధు, నాగరాజు పాల్గొన్నారు.

క్షయరహిత సమాజం కోసం పాటుపడుదాం



క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రతి ఒక్కరు క్షయరహిత సమాజం కోసం పాటుపడాలని డాక్టర్ హకీమ్, టీబీ సూపర్ వైజర్ రవికుమార్ అన్నారు. సోమవారం ఎర్రమఠం ప్రాథమి ఆరోగ్యకేంద్రం పరిధిలోని పెద్దగుమ్మడాపురం గ్రామంలో టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రతి రోజు మంచి పౌష్టికాహారం, తగిన జాగ్రత్తలు పాటించడంతో క్షయవ్యాధి బారిన పడకుండా ఉండవచ్చన్నారు. క్షయవ్యాధిని తొలిదశలోనే గుర్తించి సరైన సమయంలో చికిత్స తీసుకొని వ్యాధి వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వాణి, హెల్త్ అసిస్టెంట్ ఉమామహేశ్వరి, సచివాలయ సిబ్బంది ఆయేషా నాయక్, 104 సిబ్బంది ఉన్నారు.

నకిలీ ఇంటి పట్టాలపై విచారణ చేపట్టాలి

నందికొట్కూరు: నకిలీ ఇంటి పట్టాలపై విచారణ చేపట్టి పేదలకు న్యాయం చేయాలని వామపక్షా పార్టీల నాయకులు లాజరస్, వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కర్నూలు రోడ్డు బైరెడ్డి నగర్‌లోని సర్వే నెంబరు 589, 590, 595లో గత 15 ఏళ్ల క్రితం నిజమైన పేదలు పూరి గుడిసెలు వేసుకొన్ని జీవనం సాగిస్తురన్నారు. అప్పట్లో వామపక్షా పార్టీలు ఇళ్ల స్థలాలు కోసం అనేక పోరాటాలు చేసి జైలుకు వెళ్లిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. అప్పటి జడ్జి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తహసీల్దార్‌కు ఆదేశించిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి నకిలీ పట్టాలపై విచారణ చేపట్టి అర్హులైన పేదలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు శ్రీనివాసులు, సరోజమ్మ, బీబీ, సోమన్న, రామకృష్ణ, గుడిసెవాసులు శాంతమ్మ, రోజమ్మ, విశ్రాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'దళిత సర్పంచునని ఆహ్వానించలేదు'



తహసీల్దార్ సుభద్రమ్మకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచు మేకల భాగ్యమ్మ

పాములపాడు: రేషన్ డీలర్లు ఈ నెల 1వ తేదీన రేషన్ దుకాణాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి దళిత సర్పంచునని తనను ఆహ్వానించకుండా ప్రొటోకాల్ విస్మరించారని పాములపాడు సర్పంచు మేకల భాగ్యమ్మ ఆరోపించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ సుభద్రమ్మకు కుటుంబ సభ్యులతో కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలో 3 రేషన్ దుకాణాలున్నాయన్నారు. డీలర్లు ప్రాంభోత్సవ కార్యక్రమానికి కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా తనను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ విస్మరించిన రేషన్ డీలర్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయం తహసీల్దార్ స్పందిస్తూ రేషన్ డీలర్లకు నోటీసులు పంపిస్తామని, తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.

బైక్, ట్రాక్టర్ ఢీ... ఒకరు మృతి



మృతిచెందిన మహమ్మద్

జూపాడుబంగ్లా: ఎన్‌హెచ్ 340సీ రోడ్డుపై తర్తూరు అంచెవద్ద సోమవారం పల్సర్‌బైక్, ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా మరొకర తీవ్రంగా గాయపడ్డారు. మండ్లెం గ్రామానికి చెందిన జంగాల మోహనమురళి ట్రాక్టర్ నడుపుకుంటూ నందికొట్కూరు వైపు వెళ్లేందుకు తర్తూరు అంచెవద్ద ఎన్‌హెచ్ 340సీ హైవే రోడ్డు ఎక్కుతుండగా ఎదురుగా నందికొట్కూరు నుంచి మండ్లెం గ్రామానికి బైక్‌పై వస్తున్న వారు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇమ్రాన్, మహమ్మద్‌లకు కాళ్లు విరగటంతో వారిని 108లో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కరీం అనే మరో వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. ఇందులో మహమ్మద్ కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సపొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా తర్తూరు అంచెసమీపంలో ఎలాంటి ప్రమాదహెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయకపోవటంతోనే ప్రమాదం జరిగిందని ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సంజీవ తెలిపారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

కొత్తపల్లి: పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి కేతం వెంకటశివుడు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఉమారాణికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి భీమలింగం, సభ్యులు లింగమయ్య, అయ్యస్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యాన్ని పట్టించుకోరూ!



రోడ్డు పక్కన నిల్వ ఉన్న చెత్త కుప్ప

బండిఆత్మకూరు : సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో పారిశుద్ధ్యం మెరుగుకు అధికారులు చర్యలు తీసుకున్న ధాఖలాలు కనిపించడం లేదు. లింగాపురం గ్రామంలో సంతజూటూరుకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త కుప్పలతో ఆ ప్రాంతం దుర్గంధం వెదజల్లుతోంది. యంత్రాంగం పారిశుధ్య చర్యలు చేపట్టడం లేదని, ఇంతకు ముందెన్నడూ ఇలా ఉండలేదని, ఇప్పుడెందుకో అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

అన్నప్రసాద పథకానికి బియ్యం అందజేత



శరభారెడ్డికి రసీదు అందిస్తున్న ఏఈఓ

మహానంది: క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద పథకానికి అబ్బీపురం గ్రామ సర్పంచ్ శవ్వా శ్రీలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు శరభారెడ్డి దంపతులు పది బస్తాల బియ్యాన్ని సోమవారం విరాళంగా అందించారు. ఈ మేరకు వారు దేవస్థానం కార్యాలయానికి చేరుకుని ఏఈఓ మధు, ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, ఎం. నీలకంఠరాజు, అన్నప్రసాద పథకం ఇన్‌చార్జ్ రామశివను కలిసి బియ్యం అందించారు. ఒక్కొక్క బస్తాకు 50 కిలోల చొప్పున 500 కిలోల బియ్యం అందించినట్లు అధికారులు చెప్పారు. దాతను సన్మానించి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



కార్డెన్ సర్చ్ నిర్వహిస్తున్న రూరల్ సీఐ, ఎస్ఐలు

నందికొట్కూరు: శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. సోమవారం మిడుతూరు మండల పరిధిలోని నాగలూటి గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. రౌడీషీటర్లు, అనుమానిత ప్రాంతాలు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో విస్తృతంగా దాడులు చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 18 క్వార్టర్ బాటిళ్లను, సరైన ధ్రువపత్రాలు లేని 16 మోటారు సైకిళ్లను, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఓబులేసు, తిరుపాలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కంది పోయినట్టేనా!

- అరకొరగా రేషన్ పంపిణీ
- నాలుగు నెలలుగా కందిపప్పు అందజేయని ప్రభుత్వం
- బియ్యం, పంచదార మాత్రమే అందజేత
- ప్రభుత్వ తీరుపై కార్డుదారుల ఆగ్రహం



కందిపప్పు



రేషన్ దుకాణాల ద్వారా సరుకులు తీసుకుంటున్న కార్డు దారులు

బండిఆత్మకూరు : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయి. రేషన్ డిపోల ద్వారా సరకులు అరకొరగా సరఫరా చేయడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పేదల ఇంట్లో కందిపప్పు కనుమరుగవ్వగా, మార్కెట్‌లో కొనుక్కునే స్తోమత లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు.

కందిపప్పు ఏదీ?

మార్కెట్లో కందిపప్పు ధర గణనీయంగా పెరిగింది. పౌర సరఫరాల శాఖ ద్వారా కందిపప్పు తీసుకోవాలన్న రేషన్ కార్డుదారుల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లింది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించి కందిపప్పు పంపిణీకి మంగళం పాడింది. నాలుగు నెలలుగా కేవలం బియ్యం, పంచదార మాత్రమే అందజేస్తున్నారు. కనీసం మే నెలలో అయినా కందిపప్పు ఇస్తారని కార్డుదారులు ఆశగా ఎదురుచూశారు. నాలుగు నెలలుగా కందిపప్పు ఇవ్వకపోవడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. బహిరంగ మార్కెట్లో కిలో కంది పప్పు ధర రూ.130 నుంచి రూ.150 పలుకుతోంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కిలో రూ.67కు లభిస్తుండడంతో కొంతవరకు సంతృప్తి చెందేవారు. ఈ ఏడాది జనవరి తర్వాత కంది పప్పు పంపిణీకి ప్రభుత్వం చేతులెత్తేయడంతో పేద, మధ్య తరగతి వర్గాల్లో ఆందోళన నెలకొంది.

రాగులు, జొన్నలు ఏవీ?..

ప్రతి నెలా కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యం మాత్రమే అందజేస్తున్నారు. పంచదార అరకొరగా ఇస్తున్నారు. ఇక ప్రతి నెలా రేషన్ పంపిణీలో రాగులు, జొన్నలు అందజేస్తామని పౌరసరఫరాల శాఖా మంత్రి మనోహర్ ప్రకటించారు. అయితే ఫిబ్రవరిలో జొన్నలు అరకొర ఇచ్చినా, రాగుల ఊసే లేదు. ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డిపో ద్వారా అన్ని రకాల సరకులు రాయితీ ధరలకు ఇస్తామని, సంక్రాంతి కానుకలు అందిస్తామని కూటమి నాయకులు ఊదరగొట్టారు. కానుకల మాట అటుంచితే, ప్రతి నెలా ఇచ్చే సరకులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ పంపిణీ కేవలం బియ్యం, చక్కెరకే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో రేషన్ కార్డుల వివరాలు..	
మండలం	రేషన్ కార్డులు
శ్రీశైలం	7110
ఆత్మకూరు	23,281
వెలుగోడు	15,451
బండిఆత్మకూరు	15,198
మహానంది	12,094
మొత్తం	73,134


నాలుగు నెలలుగా ఇవ్వడం లేదు



రేషన్ సరకులు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. నాలుగు నెలలుగా కంది పప్పు ఇవ్వడం లేదు. జనవరిలో ఇచ్చారు. వచ్చే నెలలో అయినా కంది పప్పు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– శ్రీదేవి, పరమటూరు

పేదలపై చిన్నచూపు తగదు



కూటమి ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. కనీసం కందిపప్పు కూడా కార్డుదారులకు ఇవ్వడం లేదు. బయట మార్కెట్లో కొందామంటే ధరలు ఎక్కువగా ఉన్నాయి. కనీసం పప్పు కూడా చేసుకుని తినేందుకు పేదలు నోచుకోలేదా. పేదలంటే చిన్న చూపు తగదు. వచ్చే నెల నుంచి హామీలిచ్చిన వాటినన్నింటినీ అందజేయాలి.

– ఎక్కలదేవి శోభారాణి, పెద్దదేవళాపురం